




జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు








| గురువారం 26 ఫిబ్రవరి 2026 | పేజీలు 04 | వెల రూ: 2/- | సంపుటి 01 ,సంచిక 269 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత |
|---|---|---|---|---|---|




## తెలంగాణ అభ్యుదయానికి కృత్రిమ మేధస్సు దిశగా సీఎం రేవంత్ రెడ్డి - శంతను నారాయణ్ భేటీ

సందేశం టైమ్స్, జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 26 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని అడోబ్ సంస్థ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి, తెలంగాణ అభ్యుదయ 2047 దూరదృష్టి మండలి సభ్యుడు శంతను నారాయణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రపంచ ధోరణులు, భవిష్యత్ అవకాశాలపై ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యల గురించి ఇద్దరూ విస్తృతంగా చర్చించారు. ప్రపంచ తయారీ రంగం, హరిత శక్తి, ఉద్యోగాలపై కృత్రిమ మేధస్సు ప్రభావం, యువతకు నైపుణ్యాభివృద్ధి మరియు పునర్నైపుణ్య శిక్షణ అంశాలపై సమావేశంలో ముఖ్యంగా చర్చించారు. తెలంగాణను తయారీ శక్తిగా అభివృద్ధి చేసి ప్రముఖ సంస్థలను ఆకర్షించేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కృత్రిమ మేధస్సు విప్లవం చూపే ప్రభావం, భవిష్యత్తులో దాన్ని సమర్థవంతంగా వినియోగించే మార్గాలపై కూడా చర్చించారు. తెలంగాణను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సహకారం అందించాలని ముఖ్యమంత్రి శంతను నారాయణ్‌ను కోరారు.



## ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్,సూర్యాపేట, ఫిబ్రవరి 26: సూర్యాపేట నారాయణ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న పలు తరగతి గదులను సందర్శించి విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాస్తున్న తీరు పరిశీలించిన ఆయన, కేంద్రంలో కల్పించిన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల నిఘాలో ప్రశ్నాపత్రాలను తెరిచి ఇన్విజిలేటర్లకు అందజేస్తున్న గదిని పరిశీలించి విధివిధానాలు సక్రమంగా అమలవుతున్నాయో లేదో చూశారు. పరీక్షల నిర్వహణ ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, నియమావళిని కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 607 సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీ ప్రక్రియ వేగం



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 26 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 607 సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీ ప్రక్రియ వేగవంతమైంది. ఇందుకు సంబంధించి అభ్యర్థుల వివరాలను వైద్య మరియు ఆరోగ్య సేవల నియామక మండలి విడుదల చేసింది. విడుదల చేసిన జాబితాపై ఈ నెల 28వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు మండలి ప్రకటించింది. అందిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం తుది ప్రతిభా జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపింది. నియామక ప్రక్రియ పూర్తయిన తరువాత మార్చి నెలాఖరు నాటికి కొత్తగా ఎంపికైన సహాయ ఆచార్యులు తమ విధుల్లో చేరనున్నట్లు అధికారులు వెల్లడించారు.



## రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మాణం

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 26: రాష్ట్రంలో ప్రజలకు సౌకర్యవంతమైన, పారదర్శక పరిపాలన అందించాలనే లక్ష్యంతో తహసీల్దార్ మరియు ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మొదటి దశలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో భవనాలు నిర్మించనున్నట్లు, రెండో దశలో శిథిలావస్థలో ఉన్న 170 తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలను పునర్నిర్మించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే విధంగా రూపకల్పన చేస్తామని, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. గతంలో ప్రణాళికాబద్ధత లేకుండా మండలాల పునర్విభజన జరగడంతో అనేక కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేసిందని తెలిపారు. స్టాంపులు మరియు నమోదు శాఖలో కూడా సమీకృత ఆధునిక భవనాల నిర్మాణం చేపట్టి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు.

## తెలంగాణ ఆర్థికాభివృద్ధికి పశుసంవర్ధక, పాడి రంగాలు బలోపేతం చేయాలి: మంత్రి వాకిటి శ్రీహరి



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 26: తెలంగాణకు ఆర్థిక మూలాలు పెంచే దిశగా పశుసంవర్ధకశాఖను సమగ్రంగా అభివృద్ధి పరచాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సేవలు మరియు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులకు దిశానిర్దేశం చేశారు. డా. బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో 2026-2027 సంవత్సరానికి సంబంధించిన పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి బడ్జెట్ ప్రతిపాదనలపై నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ కొత్త ఆలోచనలతోనే శాఖలో మార్పులు సాధ్యమని, పాడి పరిశ్రమ బలోపేతం అయితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించేలా సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని, నిధుల వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు. హర్యానా, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల మోడళ్లను ఆదర్శంగా తీసుకుని పథకాలు రూపొందించాలని, పాల ఉత్పత్తి పెంపు, మౌలిక వసతుల అభివృద్ధి, వెటర్నరీ సేవల బలోపేతం, టీకాలు మరియు ఔషధాల సరఫరా వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మాణం కోసం స్వచ్ఛమైన పాలు, పోషక విలువలున్న చికెన్, మటన్, చేపల ఉత్పత్తి పెంచాలని పేర్కొన్నారు. సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేస్తే మంచి ఫలితాలు సాధ్యమని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర డెయిరీ అభివృద్ధి చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా కె. శ్రీనివాస్ రెడ్డి పదవీకాలం మరో రెండేళ్లు పొడిగింపు



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 26: తెలంగాణ ప్రభుత్వం సమాచార మరియు పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా కొనసాగుతున్న కె. శ్రీనివాస్ రెడ్డి పదవీకాలాన్ని మరో రెండేళ్ల పాటు పొడిగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ పరిపాలన (సమాచార మరియు పౌరసంబంధాలు) శాఖ జి.ఓ.ఆర్.టి. నం.289, తేదీ 25-02-2026 ప్రకారం ఈ నిర్ణయం తీసుకోగా, 25-02-2026 నుంచి ఈ పొడిగింపు అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే మంజూరైన వేతనం, భత్యాలు, సౌకర్యాలు మరియు సహాయక సిబ్బంది కొనసాగుతాయని, సంబంధిత వ్యయాన్ని సమాచార మరియు పౌరసంబంధాల శాఖ నిధుల నుంచి భరించనున్నట్లు స్పష్టం చేశారు. ఇతర నియామక నిబంధనలు యథాతథంగా కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొంటూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

## సమాజసేవలో ఎన్జీవోలు ముందుండాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సందేశం టైమ్స్,సూర్యాపేట, ఫిబ్రవరి 26: సమాజసేవలో ప్రతి ఒక్కరూ ముందుండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. డాక్టర్స్ ఫర్ యు అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో హెచ్సిఎల్ ఫౌండేషన్ విరాళంగా అందించిన అత్యాధునిక వైద్య పరికరాలను సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనరల్ ఆసుపత్రికి అత్యాధునిక పరికరాలు అందించిన హెచ్సిఎల్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈపరికరాలద్వారారోగిసంరక్షణ, వైద్య సేవల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందలేని పేదలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నాణ్యమైన వైద్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు కూడా ప్రైవేట్ స్థాయిలో సేవలు అందిస్తాయనే నమ్మకం ప్రజల్లోపెరుగుతుందని,సుదూరప్రాంతాలకు వెళ్లలేని పేదలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల్లో ఆరోగ్య సంరక్షణ మౌలిక వసతులను బలోపేతం చేయాలనే హెచ్సిఎల్ ఫౌండేషన్ ఆలోచన ప్రశంసనీయమని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల అదనపు డిఎంఈ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. జయలత, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అదనపు డిఎంఈ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. శ్రావణ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, హెచ్సిఎల్ ఫౌండేషన్ అసోసియేట్‌డైరెక్టర్‌సీమిసూరి,డాక్టర్‌చేతన తీర్థహళ్లి, డాక్టర్ ప్రవీణ్ కుమార్ గుప్తా తదితరులుపాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఫిబ్రవరి 26 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి): ఇంటర్మీడియట్ ప్రజా పరీక్షల నిర్వహణను పర్యవేక్షించే క్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య బుధవారం పరీక్షల తొలి రోజున జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మరియు షాహిన్ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా హాళ్లలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరు, పరీక్షల నిర్వహణ విధానాన్ని నిశితంగా పరిశీలించి విద్యార్థుల హాజరు వివరాలను ఆరా తీశారు. నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోనే ప్రశ్నాపత్రాలు తెరిచారా లేదా అన్నది పరిశీలించడంతో పాటు సీసీటీవీ నిఘా మధ్య ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నారా అనే అంశాన్ని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి సదుపాయం, వైద్య సహాయానికి ఏఎన్ఎం అందుబాటులో ఉండటం, మరుగుదొడ్ల వసతులు వంటి మౌలిక సదుపాయాలను కూడా పరిశీలించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షలు పూర్తైన వెంటనే సమాధాన పత్రాలను తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు సురక్షితంగా తరలించాలని సూచిస్తూ ఎలాంటి నకిలీ చర్యలకు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకతతో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో సంబంధిత పరీక్షా కేంద్రాల ప్రధాన పర్యవేక్షకులు మరియు అధికారులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతం – హాజరు శాతం 96.90% నమోదు




సందేశం టైమ్స్,సంగారెడ్డి, ఫిబ్రవరి 26: జిల్లాలో నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం ప్రథమ సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృత భాషా పేపర్ల పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్ తెలిపారు. మొత్తం 18,179 మంది విద్యార్థులకు గాను 17,616 మంది హాజరయ్యారని, వీరిలో జనరల్ కోర్సుకు చెందిన 16,438 మంది, వృత్తి కోర్సుకు చెందిన 1,178 మంది ఉన్నారని పేర్కొన్నారు. 563 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, అందులో జనరల్ కోర్సుకు చెందిన 414 మంది, వృత్తి కోర్సుకు చెందిన 149 మంది ఉన్నారని తెలిపారు. మొత్తం హాజరు శాతం 96.90 శాతంగా నమోదైందని, ఎటువంటి అక్రమాలు నమోదు కాలేదని వెల్లడించారు. పరీక్షల నిర్వహణ పర్యవేక్షణ కోసం కన్వీనర్/డీఐఈఓ 2 కేంద్రాలు, డీఈసీ సభ్యులు 11 కేంద్రాలు, హెచ్‌పీసీ సభ్యులు 4 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు 11 కేంద్రాలు, సిట్టింగ్ స్క్వాడ్లు 8 కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.

# సంగారెడ్డి ఏటీసీ సెంటర్‌లో ఓజేటీ కార్యక్రమంపై విద్యార్థుల స్పందన







సంగారెడ్డి, ఫిబ్రవరి 26:- సంగారెడ్డి ఏటీసీ సెంటర్‌లో నిర్వహించిన ఆన్ జాబ్ ట్రైనింగ్ (OJT) కార్యక్రమంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.సంగారెడ్డి ప్రభుత్వ ఐటీఐలో రెండో సంవత్సరం చదువుతున్న శిక్షణార్థి మంజునాథ్ మాట్లాడుతూ, ఏటీసీ సెంటర్‌లో ఓజేటీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మహేంద్ర సంస్థ ప్రతినిధులు అందించిన శిక్షణ తమకు ఎంతో ఉపయోగకరంగా మారిందని తెలిపారు. క్రమశిక్షణ, పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్మెంట్ వినియోగం, భద్రతా నిర్వహణ విధానాలు వంటి ముఖ్య అంశాలను ప్రాక్టికల్‌గా నేర్చుకునే అవకాశం లభించిందని చెప్పారు.విద్యార్థి మంగలి యశ్వంత్ మాట్లాడుతూ, ఒకవైపు చదువు కొనసాగిస్తూనే మరోవైపు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఓజేటీ కార్యక్రమంలో శిక్షణ పొందడం ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడుతుందని, చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

# విదేశీ ఉపాధి అవకాశాల పెంపుకు కేంద్ర-రాష్ట్ర సమన్వయం అవసరం: మంత్రి జి. వివేక్ వెంకటస్వామి



హైదరాబాద్, ఫిబ్రవరి 26: యువతకు మెరుగైన విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్య శిక్షణ, కోర్సుల ఎంపిక, పాస్‌పోర్టు సేవలు, వలస విధానాల అంశాల్లో కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అవసరమని కార్మిక, ఉపాధి మరియు గనుల శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. సచివాలయంలో విదేశాంగ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమై మంత్రి మాట్లాడుతూ, సాంకేతిక నైపుణ్యాలతో పాటు విదేశీ భాషలపై క్రమబద్ధమైన శిక్షణ ఇవ్వడం ద్వారా అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. విదేశీ నియామకాలకు సిద్ధం చేయడానికి మార్గదర్శకులు, కెరీర్ సలహాదారులతో బలమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వృత్తిపరమైన కోర్సులతో పాటు భాషా శిక్షణా కేంద్రాలను విస్తరించడం ద్వారా విదేశీ ఉద్యోగ అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని పేర్కొన్నారు.సమావేశానికి కాన్సులర్, పాస్‌పోర్టు మరియు ప్రవాస భారతీయుల వ్యవహారాల కార్యదర్శి శ్రీప్రియా రంగనాథన్, విదేశీ ఉపాధి విభాగ సంయుక్త కార్యదర్శి మరియు ప్రవాసుల సంరక్షణ ప్రధానాధికారి సురీందర్ భగత్, హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి అజిత్ జాన్ జోషువా హాజరయ్యారు. కేంద్రం మరియు రాష్ట్రం అమలు చేస్తున్న విదేశీ ఉపాధి కార్యక్రమాలను సమీక్షించారు. విదేశీ ఉపాధి ఆశిస్తున్న విద్యార్థులకు క్రమబద్ధమైన శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని శ్రీప్రియా తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రశంసిస్తూ, విదేశాలకు వెళ్లే యువతకు సాంస్కృతిక అవగాహన కల్పించడం కూడా ముఖ్యమని చెప్పారు.కార్పొరేట్ శిక్షణా సంస్థలను విదేశీ నియామక దారులతో అనుసంధానం చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని, అక్రమ వలసలను అరికట్టేందుకు గ్రామీణ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు జారీ చేసే ధ్రువపత్రాలను కేంద్ర సంస్థల ద్వారా సమన్వయంతో ధృవీకరించే విధానాన్ని బలోపేతం చేయాలని తెలిపారు.సమావేశంలో కార్మిక, ఉపాధి శాఖ ప్రత్యేక కార్యదర్శి దానా కిశోర్ రాష్ట్రం చేపడుతున్న చర్యలను వివరించారు. పారిశ్రామిక శిక్షణా సంస్థలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని, రాష్ట్రంలో జారీ అయ్యే పలు ధ్రువపత్రాలకు జాతీయ స్థాయి గుర్తింపు లభిస్తున్నదని తెలిపారు. పాస్‌పోర్టు జారీ ప్రక్రియ, సురక్షిత మరియు చట్టబద్ధ వలస విధానాలపై అవగాహన పెంపుపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

# మూడవ త్రైమాసికంలో రుణాల పంపిణీలో 88.44 శాతం లక్ష్యసాధన

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




సందేశం టైమ్స్,సూర్యాపేట, ఫిబ్రవరి 26: 2025-26 ఆర్థిక సంవత్సర మూడవ త్రైమాసికానికి సంబంధించిన జిల్లా సమన్వయ బ్యాంకర్ల సమావేశాన్ని బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధ్యక్షతన, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకట నాగ ప్రసాద్ కన్వీనర్‌గా నిర్వహించారు. ఏప్రిల్ 2025 నుండి డిసెంబర్ 2025 వరకు వ్యవసాయ రుణాల వార్షిక లక్ష్యం 3915.15 కోట్లుగా నిర్ణయించగా తొమ్మిది నెలల్లో 3568.08 కోట్లు సాధించారని, దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలలో 2999.48 కోట్ల లక్ష్యానికి 3075.68 కోట్లు సాధించి లక్ష్యాన్ని మించారని తెలిపారు. ప్రాధాన్యత రంగాల్లో 9723.13 కోట్ల లక్ష్యానికి 7826.27 కోట్లు పంపిణీ చేసి 80.49 శాతం వృద్ధి సాధించారని, మొత్తం వ్యవసాయ రుణాల్లో 6914.63 కోట్ల లక్ష్యానికి 6643.76 కోట్లు అందించి 96.08 శాతం సాధించారని వివరించారు. జిల్లా వార్షిక ప్రణాళికలో 11919.74 కోట్ల లక్ష్యానికి 10541.35 కోట్లు పంపిణీ చేసి 88.44 శాతం పురోగతి సాధించినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, ఆర్బీఐ ఎల్డీఓ గోమతి, నాబార్డ్ జిల్లా మేనేజర్ రవీంద్ర నాయక్, ఎస్బీఐ రీజినల్ మేనేజర్ అనిల్ కుమార్, యూనియన్ బ్యాంక్ డీజీఎం సుధాకర్ రావు, జిల్లా పరిశ్రమల అధికారి సీతారాం నాయక్, సంక్షేమ అధికారులు మరియు జిల్లాలోని రీజినల్ బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.




# సూర్యాపేట జిల్లాకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఫిబ్రవరి 26: రాష్ట్ర నీటిపారుదల మరియు కమాండ్ ఏరియా అభివృద్ధి, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం సూర్యాపేట జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఉదయం హైదరాబాద్ నుండి బయలుదేరి తుర్కయంజల్ చేరుకుని కార్యక్రమంలో పాల్గొననున్న మంత్రి, అనంతరం హుజూర్‌నగర్ రామస్వామిగుట్ట హౌసింగ్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించనున్నారు. మధ్యాహ్నం చింతలపాలెం మండలం పాత వెల్లటూరు గ్రామంలో రూ.1500 కోట్ల వ్యయంతో 45 వేల ఎకరాలకు నీరు అందించే మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కాలువ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పనులను పరిశీలించనున్నారు. సాయంత్రం చిల్కూరు, మునగాల, నేరేడుచర్ల మండలాల్లో పలు రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. నేరేడుచర్ల మండలంలో బీటి రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించడంతో పాటు సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. జిల్లా అధికార యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సమాచారం.

# ఆయిల్ పామ్ సాగు లక్ష్య సాధనకు కృషి చేయాలి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్






సంగారెడ్డి, ఫిబ్రవరి 26:- జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు ఆయిల్ పామ్ సాగు జరిగేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ ఏఈఓలకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా 3,750 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, రైతులను ప్రోత్సహించి ఆ లక్ష్యాన్ని సాధించాలని అన్నారు.కలెక్టరేట్ సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓలతో ఆయిల్ పామ్ సాగు పురోగతిపై క్లస్టర్ల వారీగా సమీక్ష జరిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లాభదాయకమైన ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో 1,850 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరిగిందని వెల్లడించారు.రైతులకు ఆయిల్ పామ్ సాగు లాభాలపై స్పష్టమైన అవగాహన కల్పించి, లక్ష్యానికి మించి అధిక విస్తీర్ణంలో సాగు చేపట్టేలా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో యూరియా కొరతలేదని, సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, రైతు బీమా సంబంధిత అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సోమేశ్వర్, గోద్రెజ్ సంస్థ జనరల్ మేనేజర్ స్వీటీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బోరంచ గ్రామంలో రూ.10 లక్షలతో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శ్రీకారం




సందేశం టైమ్స్,నారాయణఖేడ్, ఫిబ్రవరి 26 (టీ. సంగమేశ్వర్)సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని మానూర్ మండలంలోని బోరంచ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ మహిళా సమాఖ్య భవన నిర్మాణ కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. మహిళా సంఘాల సాధికారత, స్వయం ఉపాధి ప్రోత్సాహం మరియు సామాజిక-ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా రూ.10 లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ పి. సంజీవరెడ్డి, సురేష్ కుమార్ షేట్కార్ మార్గదర్శకత్వంలో గ్రామ సర్పంచ్ పంచగామ బీరప్ప ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. బోరంచ గ్రామ ఉపసర్పంచ్ మొల్ల కరీమ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సాయమ్మ, విఓఏ అనుసుజ, గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్, వార్డు సభ్యులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన వారు మహిళా సమాఖ్య భవనం గ్రామ మహిళలకు శక్తివంతమైన వేదికగా నిలుస్తుందని, స్వయం సహాయక సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమాలకు ఇది ఎంతో ఉపయోగకరమని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు, సామాజిక గౌరవానికి ఇది కీలకమైన అడుగని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. భవనం నిర్మాణం పూర్తయ్యిన తర్వాత మహిళల ఐక్యత, సాధికారత మరింత బలోపేతం అవుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# తాలేల్మా గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

సందేశం టైమ్స్,సంగారెడ్డి, ఫిబ్రవరి 26 (బి. రమేష్ బాబు) అందోల్ నియోజకవర్గ పరిధిలోని తాలేల్మా గ్రామంలో ప్రజా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు లబ్ధిదారుడు అవుసలి లక్ష్మినారాయణ చారి కొత్తగా నిర్మించిన నివాస గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గంగాధర్ సునీత అశోక్, కొడూరు సామెల్ ఉపసర్పంచ్, మంతురి మాణిక్యం గౌడ్, నాగభూషణం, బగిలి మల్లప్ప, గాండ్ల నవీన్, మేతరి ప్రసాద్, సభ్యులు సింగురాజు, డాకూరు మల్లేశం, జగదీశ్వరి, రాజోలు నాగరాజు, బస్వారాజ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై లబ్ధిదారుడికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించడం గొప్ప విషయమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు ప్రభుత్వం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

# పటాన్చెరులో రూ.35 లక్షల డ్రైనేజీ పనులకు శంకుస్థాపన – ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సందేశం టైమ్స్,పటాన్చెరు, ఫిబ్రవరి 26 (బి. డేవిడ్) పటాన్చెరు నందన్ పారడైజ్ కాలనీలో రూ.35 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న నూతన డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పాల్గొన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, డ్రైనేజీ వంటి ప్రాథమిక సదుపాయాలు ప్రజల ఆరోగ్యానికి అత్యంత కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇదే సందర్భంగా ప్రారంభమైన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పరీక్షా కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని కేంద్ర యాజమాన్యం మరియు పోలీసు శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు.



# సంగారెడ్డి జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు – కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ పరితోష్ పంకజ్

సందేశం టైమ్స్,సంగారెడ్డి, ఫిబ్రవరి 26 (టీ. సంగమేశ్వర్) సంగారెడ్డి జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. బుధవారం సంగారెడ్డి ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల, సెయింట్ ఆంథోని జూనియర్ కళాశాల, ఎస్.వి జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను సందర్శించిన ఎస్పీ బందోబస్తు ఏర్పాట్లు, వైద్య అత్యవసర బృందాలు, పరీక్షార్థులకు కల్పించిన కనీస సౌకర్యాలను సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్రాల పరిసరాల్లో 163 బి.ఎన్.ఎస్.ఎస్ ప్రకారం నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని, గుంపులుగా తిరగడం నిషేధమని స్పష్టం చేశారు. ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు పరీక్షలు జరుగుతున్నందున పరీక్షా కేంద్రాల నుండి 100 మీటర్ల పరిధిలో జిరాక్స్ కేంద్రాలు తెరవకూడదని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందని ఎస్పీ వెల్లడించారు.



# పటాన్చెరులో ఇంటర్ పరీక్షలు ప్రారంభం – కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి

సందేశం టైమ్స్,పటాన్చెరు, ఫిబ్రవరి 26 (బి. డేవిడ్) పటాన్చెరు పట్టణంలోని శాంతినికేతన్ మరియు మంజీరా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం నుంచే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందడి కనిపించింది. హాల్ టికెట్ నంబర్లను సరిచూసుకుని విద్యార్థులు క్రమపద్ధతిలో కేంద్రాల్లోకి ప్రవేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు కేంద్రాల పరిసరాల్లో నిఘా పెంచారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమై సజావుగా కొనసాగుతున్నట్లు కేంద్రాల నిర్వాహకులు తెలిపారు.



# చీకోడ్ గ్రామంలో 'విద్యార్థులే ఉపాధ్యాయులు' కార్యక్రమం నిర్వహణ

సందేశం టైమ్స్,మెదక్ జిల్లా, ఫిబ్రవరి 26 (జి. కుమార్) పాపన్నపేట మండలంలోని చీకోడ్ గ్రామంలో బుధవారం 'విద్యార్థులే ఉపాధ్యాయులు' అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదవ తరగతి విద్యార్థులు పాఠశాలలో వివిధ హోదాల్లో బాధ్యతలు స్వీకరించి విధులు నిర్వర్తించారు. డి. దీక్షిత డీఈఓగా, మోక్షిత్ చారి ఎంఈఓగా, ఎం. మోక్షిత ప్రధానోపాధ్యాయురాలిగా వ్యవహరించగా, నిహారిక, స్పందన, తేజ, సాత్విక్, నందిని, మహేష్, యశ్వంత్, రవీందర్, భరత్, అఖిల్, మహేశ్వరి ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించారు. సాత్విక్ పీఈటీగా వ్యవహరించి క్రీడా కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో విద్యార్థుల అనుభవాలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావన, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు దోహదపడిందని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.

# బిజిలిపూర్ గ్రామంలో ఉపాధి హామీ పనుల ప్రారంభం



సందేశం టైమ్స్,వట్పల్లి, ఫిబ్రవరి 26 (టీ. సంగమేశ్వర్) గ్రామీణ పేదల కరువు, నిరుద్యోగం, వలసలు మరియు పేదరికం నివారణ లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం భాగంగా వట్పల్లి మండలంలోని బిజిలిపూర్ గ్రామంలో గురువారం ఉపాధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చక్రాల నాగమణి నర్సింలు, ఉపసర్పంచ్ శోభ మంచేందర్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, మాజీ ఎంపీటీసీ నవీన సదానందం, మండల మైనార్టీ అధ్యక్షుడు షాపూద్దీన్, బిజిలిపూర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మల్లేశం, గ్రామ పెద్దలు మరియు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ చక్రాల నాగమణి నర్సింలు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఆర్థిక స్థిరత్వం సాధించేందుకు ఈ పథకం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

# చౌటకూర్ నేషనల్ హైవే బ్రిడ్జిపై లైట్లు ఏర్పాటు చేయాలని సర్పంచ్ విజ్ఞప్తి



సందేశం టైమ్స్,చౌటకూర్ మండలం, ఫిబ్రవరి 26 (టి. సంగమేశ్వర్) సంగారెడ్డి జిల్లా చౌటకూర్ వద్ద ఉన్న నేషనల్ హైవే బ్రిడ్జిపై రెండు వైపులా వీధి దీపాలు ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ రామ్ రెడ్డి అధికారులను కోరారు. బ్రిడ్జిపై పరిస్థితులను పరిశీలించేందుకు వచ్చిన సంబంధిత శాఖ అధికారులతో సమావేశమైన ఆయన రాత్రి వేళల్లో చీకటి కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాల అవకాశాలు పెరుగుతున్నాయని వివరించారు. ప్రజల భద్రత దృష్ట్యా తక్షణమే రెండు వైపులా సరిపడా వీధి దీపాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజల తరఫున ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినట్లు తెలిపారు.



# వెలుగుమట్ల ఘటనపై ఆమ్ ఆద్మీ పార్టీ ఆందోళన - జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం

సందేశం టైమ్స్,ఖమ్మం, ఫిబ్రవరి 26,ఖమ్మం జిల్లా వెలుగుమట్ల ప్రాంతంలో పేద ప్రజల ఇళ్లపై జరిగిన చర్యలను ఖండిస్తూ తెలంగాణ రాష్ట్ర ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కమిటీ, రాష్ట్ర మరియు జిల్లా నాయకులు ఖమ్మం జిల్లా పర్యటనకు వెళ్లి జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. భూధాన్ భూముల్లో నివసిస్తున్న పేదల ఇళ్లను తొలగించడం అన్యాయమని పేర్కొంటూ, చట్ట ప్రకారం అర్హులైన వారిని గుర్తించి వారికి శాశ్వత నివాస స్థలాలు కేటాయించాలని, ఇందిరమ్మ ఇల్లు లేదా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేసి న్యాయం చేయాలని కోరారు. పేద ప్రజలపై బలవంతపు చర్యలు తీసుకోవడం, వారి వంట సామాగ్రిని ధ్వంసం చేయడం, భయభ్రాంతులకు గురి చేయడం వంటి ఘటనలు ఆమోదయోగ్యం కాదని తీవ్రంగా ఆక్షేపించారు. ఖమ్మం పట్టణంలో బాధితులు ధర్నా నిర్వహిస్తుండగా సంఘీభావంగా వెళ్లిన ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర రాము గౌడ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసు వాహనంలోకి ఎక్కించారని, ఈ చర్యను పార్టీ తీవ్రంగా ఖండించింది. అరెస్టు చేసిన వారిలో పార్టీ ఉప ట్రెజరర్ జావిద్ షరీఫ్, మహిళా నాయకురాలు సుధారాణి, మల్కాజ్గిరి నాయకుడు అజీమ్ తదితరులను టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉంచినట్లు తెలిపారు. ఈ ఘటనపై సంబంధిత కానిస్టేబుల్‌పై విచారణ చేపట్టి సస్పెండ్ చేయాలని పార్టీ డిమాండ్ చేసింది. విషయం తెలిసిన వెంటనే పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ మరియు జాతీయ ప్రధాన ప్రతినిధి ప్రియాంక కక్కర్ ఫోన్ ద్వారా పరామర్శించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అధ్యక్షులు హేమ సుదర్శన్ జిల్లోజు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ అన్సారి, దర్శనం రమేష్, పరీక్షణ్ రాజ్, రాకేష్ రెడ్డి, గంధం పుల్లయ్య, కొడంగల్ శ్రీనివాస్, ఖమ్మం జిల్లా నాయకులు పశుపతి శ్రీనివాస్, స్వర్ణ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



# కంజామల్ప్వార్ బక్కరెడ్డి కుమార్తె వివాహానికి హాజరైన మాటూరు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మక్షుద్

సందేశం టైమ్స్,రాయికోడ్ మండలం, ఫిబ్రవరి 26 , సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలోని కంజామల్ప్వార్ గ్రామానికి చెందిన బక్కరెడ్డి కుమార్తె వివాహ వేడుకకు మాటూరు కాంగ్రెస్ పార్టీ గ్రామ యువ సీనియర్ నాయకుడు మక్షుద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమానికి మక్షుద్‌తో పాటు ఆయన సన్నిహితులు మరియు పార్టీ నాయకులు భారీగా తరలివచ్చారు. గ్రామస్తుల సమక్షంలో వివాహ వేడుక ఆనందోత్సాహాల మధ్య జరిగింది. నూతన దంపతులు సుఖసంతోషాలతో జీవించాలని పలువురు ఆకాంక్షించారు.



# తమిళనాట సంచలనం.. కొత్త పార్టీ పెట్టిన చిన్నమ్మ

సందేశం టైమ్స్,రామనాథపురం, ఫిబ్రవరి 26,తమిళనాడు రాజకీయాల్లో సంచలన పరిణామంగా అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు వి.కే. శశికళ కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. జయలలిత జయంతి సందర్భంగా రామనాథపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె కొత్త పార్టీ జెండాను ఆవిష్కరించి, జయలలిత, ఎంజీఆర్, అన్నా ఆదర్శ సూత్రాలతో పార్టీని స్థాపించనున్నట్లు తెలిపారు. మౌనంగా ఉంటే ప్రజలకు న్యాయం చేయలేనని స్పష్టం చేసిన ఆమె, అన్నాడీఎంకేపై తీవ్ర విమర్శలు గుప్పించారు. జైలు నుండి విడుదలైన తర్వాత తనను మళ్లీ అరెస్టు చేయాలని అన్నాడీఎంకే ప్రయత్నించిందని ఆరోపించారు. పార్టీ పతనమవుతోందని, ఈపీఎస్‌గా ప్రసిద్ధి చెందిన ఎడప్పాడి కె. పళనిస్వామి కార్యకర్తలపై శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ద్రవిడ మున్నేట్ర కళగం ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోందని ఆరోపిస్తూ, జయలలిత పాలనలో చేసిన మంచి పనులను ప్రజలు మర్చిపోలేరని పేర్కొన్నారు. ఆస్తుల కేసులో శిక్ష అనుభవించి 2021లో విడుదలైన శశికళకు 2027 వరకు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం ఉన్నప్పటికీ, కొత్త పార్టీ ప్రారంభించేందుకు ఇదే సరైన సమయమని ఆమె ప్రకటించడం తమిళనాడు రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.

# ఆడపడుచుకు అండగా హస్నాబాద్ రికార్డు సర్పంచ్ తులసి హనుమంత్



సందేశం టైమ్స్,రాయికోడ్ మండలం, ఫిబ్రవరి 26, సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం రాయికోడ్ మండలంలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన చాకలి మన్నెమ్మ, విట్టల్ దంపతుల కుమార్తె మేఘమాల వివాహ మహోత్సవానికి హాజరైన గ్రామ సర్పంచ్ తులసి హనుమంత్ కుటుంబానికి కానుకగా రూ.10,000 నగదు సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తులసి హనుమంత్ మాట్లాడుతూ గ్రామ ఆడబిడ్డలు ఆనందంగా ఉండాలని, వారి తల్లిదండ్రులకు వివాహ సమయంలో తమ వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. నూతన వధూవరులను ఆశీర్వదిస్తూ వారు సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి గ్రామ తొలి మహిళా ఉపసర్పంచ్ మంగలి భారతమ్మ, ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షులు పెద్దలు కోడూరు అంజన్న ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం తక్కువ ఇస్తున్నారా? మీ హక్కులు - ఫిర్యాదు చేసే పూర్తి విధానం

**తెలంగాణ** సందేశం టైమ్స్

సూర్యాపేట, ఫిబ్రవరి 26

ప్రభుత్వం పేదల కోసం పంపించే రేషన్ సరుకులు లబ్ధిదారుల చట్టబద్ధమైన హక్కు. డీలర్ చేసే ఉపకారం కాదు. రేషన్ బియ్యం తక్కువ ఇస్తున్నారా? డీలర్ దురుసుగా ప్రవర్తిస్తున్నారా? అయితే ఈ విషయాలు తప్పక తెలుసుకోవాలి.

మీ చట్టబద్ధమైన హక్కులు

జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం హక్కు

ప్రతి రేషన్ కార్డు దారుడికి నిర్ణీత పరిమాణంలో, నిర్ణీత ధరకే లేదా ఉచితంగా సరుకులు పొందే హక్కు ఉంది. ఎవరూ తగ్గించలేరు.

పూర్తి తూకం ఇవ్వాలి

100 గ్రాములు తక్కువ ఇచ్చినా అది నేరమే. రేషన్ షాపులో ఎలక్ట్రానిక్ తూకం యంత్రం ఉండాలి. అది మీకు కనిపించేలా ఉండాలి.

బిల్ ఇవ్వాల్సిందే

సరుకులు ఇచ్చిన తర్వాత లావాదేవీ రశీదు లేదా ఎస్ఎంఎస్ రావాలి. అది రాకపోతే అడగండి.

లంచం అడగరాదు

రేషన్ సరుకుల కోసం అదనపు డబ్బు అడగడం చట్టవిరుద్ధం.




సమస్య వస్తే వెంటనే చేయాల్సినవి

అక్కడికక్కడ తూకం సరిచూడండి

అనుమానం ఉంటే మరో వస్తువుతో తూకం చెక్ చేయమని అడగండి. డీలర్ నిరాకరిస్తే అది తప్పు.

టోల్ ఫ్రీ నంబర్ – 1967

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రేషన్ సమస్యలపై ఫిర్యాదు చేయడానికి 1967 అనే టోల్ ఫ్రీ నంబర్ ఉంది.

బియ్యం తక్కువ ఇచ్చినా

సరుకులు ఇవ్వకపోయినా

లంచం అడిగినా

వెంటనే కాల్ చేసి ఫిర్యాదు చేయండి



తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు

మీ మండల తహసీల్దార్ (ఎంఆర్వో) రేషన్ షాపులపై పర్యవేక్షణ అధికారి. వ్రాతపూర్వక ఫిర్యాదు ఇస్తే తనిఖీ చేసి షాపును సీజ్ చేసే అవకాశం ఉంది.

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

గ్రామ సభ లేదా వార్డు సమావేశంలో విషయం ప్రస్తావించండి. అవసరమైతే సామూహికంగా సంతకాలు చేసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయండి.

సోషల్ ఆడిట్‌లో నిలదీయండి

గ్రామ సభల్లో రేషన్ షాపు పనితీరుపై ప్రశ్నించే హక్కు మీకు ఉంది.

ముఖ్య సూచనలు

తూకం వేస్తున్నప్పుడు అక్కడే ఉండండి.

బియ్యం బస్తా తెరవకముందే తూకం చూడండి.

ప్రతి నెల మీకు ఎంత కోటా ఉందో తెలుసుకుని వెళ్లండి.

ఫిర్యాదు చేసిన తర్వాత ఫిర్యాదు నంబర్ నమోదు చేసుకోండి.

గుర్తుంచుకోండి

రేషన్ సరుకులు మీ హక్కు. డీలర్ అక్రమాలకు పాల్పడితే అతని లైసెన్స్ రద్దు చేయించే అధికారం కూడా మీకే ఉంది. భయపడకుండా ఫిర్యాదు చేయండి. మీ హక్కు కోసం నిలబడండి.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ–మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.